

ప్రసంగిస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు, అమరవీరుల స్తూపానికి నేతలు, అధికారుల నివాళి

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ఘనంగా పోలీసు అమరుల స్మారక దినోత్సవం

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : సమాజహితం కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీసు మహా వీరులను స్మరించుకోవడం గర్వకారణమని జిల్లా పాలనాధికారి అరుణ్ బాబు అన్నారు. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో పోలీసు అమర వీరుల దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థ లేకపోతే సంఘ విద్రోహ శక్తుల ఆగడాలకు అడ్డూ అదుపు ఉండదన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, దేశంలో పోలీసులు నిత్యం పహారా కాస్తూ ప్రజల ధన, మాన ప్రాణాలను రక్షిస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తిని పుణికి పుచ్చుకుని ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తామని పేర్కొన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పోలీసులు అమరుల త్యాగాలను కొనియాడారు. జిల్లాలో వీరమరణం పొందిన ఒక ఎస్సై, 8 మంది పోలీసు సిబ్బంది కుటుంబాలను సన్మానించారు. వారికి జ్ఞాపికలు అందజేశారు. అమరవీరుల స్తూపానికి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంయుక్త పాలనాధికారి సూరజ్ గనోరె, ఏఎస్పీ (అడ్మిన్) సంతోష్, డీఎస్పీలు నాగేశ్వరరావు, హనుమంతరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు నవంబరు 5 నుంచి బ్యూటీపార్లర్, జర్దోసి, మగ్గం వర్క్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ సంచాలకుడు జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 19-45 మధ్య వయసు మహిళలు.. తెల్లరేషన్, ఆధార్ కార్డులతో పాటు నాలుగు పాస్‌ఫోర్టు సైజు ఫొటోలు గుంటూరు కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు హాజరయ్యే మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 0863-2336912, 97006 87696, 81253 97953 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఈ-వ్యర్థం.. అనర్థం

చెత్తతో పాటు దహనం

రీసైక్లింగ్ వ్యవస్థ లేక ముప్పు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొత్త రకం ఎలక్ట్రానిక్ వస్తువు ప్రపంచానికి పరిచయం అవుతోంది. కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు, ఛార్జర్లు, బ్లూటూత్‌లు, ల్యాప్‌టాప్‌లు, బ్యాటరీలు, ఫ్రిజ్‌లు కొత్త కొత్త మోడళ్లు వస్తున్నాయని చెప్పి పాతవాటిని మార్చేస్తున్నారు. కొత్త ఫీచర్లతో వచ్చే వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. పాతవాటిని అలానే బయట పడేస్తున్నారు. దీంతో ఈ- వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వీటిని సాధారణ చెత్తతో కలిపి పడేయడమో.. నిప్పు పెట్టడమో.. డంపింగ్‌యార్డుకు తరలించడమో చేస్తున్నారు. కానీ ఈ-వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి రీసైక్లింగ్‌కు పంపించే వ్యవస్థ జిల్లాలో లేదు. ప్రధాన పట్టణాల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాల వాడకం పెరుగుతున్న వేళ, మరమ్మతులకు గురైనవి లేదా పాత ఎలక్ట్రానిక్ వస్తువులను యథేచ్ఛగా ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. దీనివల్ల భూ కాలుష్యానికి పరోక్షంగా కారణమవుతున్నాం. ఈ-వ్యర్థాలు భూమి పొరల్లోని జల వనరుల్లో కలిసిపోతున్నాయి. వీటి నుంచి విడుదలయ్యే కర్బన ఉద్గారాలు, భారలోహాలు, రసాయనాల వల్ల పర్యావరణానికే కాకుండా మనుషులకూ తీవ్ర నష్టమే.



జిల్లాలో పరిస్థితి..

జిల్లా కేంద్రం నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ వంటి పట్టణాలు ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్ల వాడకం విపరీతంగా పెరుగుతోంది. వాటికి సంబంధించిన ఛార్జర్లు, బ్లూటూత్‌లు, ఇయర్‌ఫోన్లు రకరకాల మోడళ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. యువత నెలకే పాత వస్తువును పడేసి, కొత్త రకం వస్తువును కొనుగోలు చేస్తుంది. ఇలా పాత బ్లూటూత్‌లు, ఇయర్‌ఫోన్లు, ఛార్జర్లు తదితర వస్తువులను చెత్తతో పాటే బయటపడేస్తున్నారు. ఇవీ చివరకు డంపింగ్‌యార్డుకు పోతున్నాయి. అక్కడ కొందరు చెత్తకు నిప్పు పెడుతున్నారు. ఆ సమయంలో ఈ ఎలక్ట్రానిక్ వస్తువులు చెత్తతో పాటు కాలుతున్నప్పుడు విష వాయువులు బయటకు విడుదలవుతున్నాయి.

హానికరం కావడంతో..

ఈ-వ్యర్థాలను భూమిపైన, నీటిలో పడేస్తుండడంతో పర్యావరణానికి, మానవాళికి హాని కలుగుతోంది. వీటికి నిప్పు పెట్టడం వల్ల కర్బన ఉద్గారాలు విడుదలై ప్రకృతిపై, జనజీవనంపై దుష్ప్రభావం చూపుతున్నాయి. పాడైన టీవీలు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, మెమరీ చిప్‌లను పారవేసినప్పుడు అందులోని భార లోహాలు వివిధ రసాయనాలను విడుదల చేస్తాయి. అవీ భూగర్భజలాలను విషపూరితం చేస్తున్నాయి. కాలుష్య గాలి పీల్చేవారు, కలుషిత జలాలు తాగినవారు క్యాన్సర్, మెదడు, నాడీ వ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. మహిళల్లో గర్భస్థ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

ఈ-వ్యర్థాలను సేకరించే ప్రత్యేక వ్యవస్థ లేకపోవడం వల్ల మున్సిపల్ సిబ్బంది కూడా ఏమీ చేయలేకపోతున్నారు. జిల్లాలో నరసరావుపేట మినహా మరెక్కడా డంపింగ్‌యార్డులే లేవు. అలాంటిది ఈ-వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి వాటిని రీసైక్లింగ్ పంపించడం అసాధ్యం. అంతేకాకుండా జిల్లా ఎక్కువగా గ్రామీణ వాతావరణంతో కూడుకున్నది కావడంతో ఈ-వ్యర్థాలపై అధికారులు పెద్దగా దృష్టిపెట్టడం లేదు. అయితే వీటిపై జనాల్లో అవగాహన ఉండాలని కొందరు పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మన ఇంట్లో కంప్యూటర్, ఫ్రిజ్ లేదా టీవీ లాంటివి పాడైపోతే ఎక్కడపడితే అక్కడ పడేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రీసైక్లింగ్‌కు ఉపయోగించే అవకాశం ఉంటే తిరిగి దుకాణాలకు అప్పగించాలి. ఛార్జర్లు వంటి వాటిల్లో రాగి ఉంటుందని నిప్పు పెట్టి కాల్చడం వంటివి చేయకూడదు.

రైల్వే అండర్ పాస్‌లో లీకులు.. రాకపోకలకు వెతలు



రైల్వే అండర్ పాస్ పైకప్పు నుంచి లీకైన నీరు

గుంతకల్లు-గుంటూరు రైల్వే మార్గంలో వినుకొండ పట్టణానికి అంచున నూజండ్ల రోడ్డులో గేటు నంబరు 265 స్థానంలో నిర్మించిన అండర్ పాస్ పైకప్పు నుంచి నీరు లీకవుతోంది. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రివేళ అక్కడ విద్యుత్తు దీపాలు లేకపోవడంతో అంధకారం రాజ్యమేలుతోంది.

- న్యూస్‌టుడే, వినుకొండ

పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం అమలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇసుక విధానంతో పాటు పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ఇసుకను 50 శాతం ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారికి, 40 శాతం ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి ఇవ్వాలన్నారు. అలాగే అక్రమ రవాణాకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అక్రమ రవాణాకు అవకాశం ఉన్న మార్గాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పనులకు నిరాటంకంగా సరఫరా చేసేందుకు రిజర్వ్ చేయాలని సూచించారు. ఆధార్ నవీకరణ, ఎరువుల కొరత నివారణకు చర్యలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో వినాయకం, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఏఎన్‌యూలో కశ్మీర్ యువ సమ్మేళనం

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కశ్మీర్ యువ సమ్మేళనం ప్రారంభమైంది. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ ప్రారంభించి ప్రసంగించారు. దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న యువతను జాతీయ ఐక్యత, దేశ సమగ్రత, శాంతి ప్రతిపాదకులుగా వినియోగించేలా వీరిని తయారు చేయాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం ఏపీ సంచాలకులు అంశుమన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ కశ్మీర్ యువకులలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంచే లక్ష్యంతో దీనిని ఏర్పాటుచేశామన్నారు. జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారిణి కిరణ్మయి మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో సదస్సులు, క్షేత్రస్థాయి పర్యటనలు ఉంటాయన్నారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఎరువుల నిల్వలు, అమ్మకాల పర్యవేక్షణకు టాస్క్‌ఫోర్స్ విభాగం ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాస్థాయిలో ఎరువుల సరఫరా, నిల్వలు, అమ్మకాల పర్యవేక్షణకు, ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేయటానికి జిల్లా పరిధిలోని ఏడీఏలతో టాస్క్‌ఫోర్స్ విభాగం ఏర్పాటు చేశామని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సోమవారం తెలిపారు. 'ఈనాడు'లో సోమవారం మధ్యవర్తుల మాయాజాలం శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ విభాగం ఎప్పటికప్పుడు ఎరువుల నిల్వలు, సరఫరా తనిఖీ చేస్తుందని, అవకతవకలు జరిగితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రైతులు ఎరువుల సరఫరాకు ఆందోళన చెందవద్దని, సమస్యలు ఉన్నా, ఎవరైనా డీలర్లు అధిక ధరలకు అమ్మినా సంబంధిత రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయాధికారికి, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబరు 8331056915కు కాల్ చేసి తెలిపితే చెబితే పరిష్కరిస్తామన్నారు. మరో రెండు రోజుల్లో యూరియా 1920 (కోరమండల్), 410 (జీఎస్ఎఫ్‌సీ) మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయని ఆయన వెల్లడించారు.

జిల్లాలో 183.2 మి.మీ. వర్షపాతం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 183.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. రెంటచింతలలో అత్యధికంగా 26.4 మి.మీ. కురిసింది. మాచర్లలో 2.2, దుర్గి 4.4, గురజాల 1.8, దాచేపల్లి 11.4, మాచవరం 15.6, బెల్లంకొండ 3.4, క్రోసూరు 3.0 పెదకూరపాడు 8.0, సత్తెనపల్లి 9.4, రాజుపాలెం 4.6, బొల్లాపల్లి 18.2, వినుకొండ 8.4, నూజండ్ల 6.8, శావల్యాపురం 3.0, ఈపూరు 12.4, రొంపిచర్ల 15.0, నరసరావుపేట 2.6, ముప్పాళ్ల 3.8, చిలకలూరిపేట 19.4, యడ్లపాడు 3.4 మి.మీ. కురిసింది. ఏడు మండలాల్లో వర్షం పడలేదు.

వసతుల్లేవు.. పర్యవేక్షణ లేదు



నరసరావుపేట రామిరెడ్డిపేటలోని పోస్టుమెట్రిక్ వసతి గృహంలో సిగరెట్ పీకలు, మద్యం సీసాలు



ఊడిపోయిన స్విచ్‌బోర్డు

- పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో దారుణస్థితి
- మద్యం సీసాలు, సిగరెట్ పీకలు దర్శనం
- విద్యార్థులు పక్కదారి పట్టేలా పరిస్థితులు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

గుట్టలుగా మద్యం సీసాలు.. విచ్చలవిడిగా సిగరెట్ పీకలు.. తిరగని ఫ్యాన్‌లు.. పనిచేయని స్విచ్‌బోర్డులు.. అపరిశుభ్ర పరిసరాలు.. జిల్లాలోని పలు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు ఇవి. ఇంటర్ డిగ్రీ చదివే విద్యార్థులుండే వసతి గృహాల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడతారని గ్రామాల నుంచి పట్టణాలకు పంపించి ప్రభుత్వ వసతిగృహాల్లో చేర్పిస్తే అక్కడ ఉండే వాతావరణం చూసి విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. పలు వసతి గృహాల్లో విద్యార్థులు పక్కదారి పట్టేలా పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్యలు పరిష్కరించకుంటే విద్యార్థుల భవిష్యత్తు అంధకారమేనని విద్యావేత్తలు ఆవేదన చెందుతున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లోనే ఇలాంటి వాతావరణం కనిపిస్తోంది.

వార్డెన్ల కొరత.. పర్యవేక్షించే వారేరీ?

జిల్లాలో పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో వార్డెన్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎస్సీ వసతి గృహాలనే తీసుకుంటే జిల్లాలో 11 వసతి గృహాలుండగా.. ఇందులో ఏడింట్లో రెగ్యులర్ వార్డెన్లు ఉండగా.. నాలుగు చోట్ల ఇన్‌ఛార్జిలతో నడిపిస్తున్నారు. 14 బీసీ వసతి గృహాల్లో ఒకచోట ఇన్‌ఛార్జి వార్డెన్ ఉన్నారు. గిరిజన వసతి గృహాల్లో మాత్రం మూడుచోట్లా రెగ్యులర్ వార్డెన్లు ఉన్నారు. వసతి గృహాల్లో వార్డెన్లు లేక విద్యార్థుల ఇష్టారాజ్యం అవుతోంది. అడిగేవారు లేకపోవడంతో రాత్రిళ్లు కొన్నిచోట్ల మద్యం సీసాలను నేరుగా వసతిగృహాలకే తీసుకొస్తున్నారు. కొందరు ధూమపానం కూడా చేస్తున్నట్లు సమాచారం. కళాశాల విద్య కోసం గ్రామాల నుంచి పట్టణాలకు రావడం.. కొత్త స్నేహాలు.. బిర్యానీ.. మందు.. సిగరెట్.. వంటి అలవాట్లతో విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. ఇలాంటి అలవాట్లకు వసతిగృహాలు నిలయాలుగా మారడం బాధాకరం.



ఫ్యాను ఇలా..

జిల్లాలో..

గిరిజన వసతి గృహాలు మొత్తం : 3

విద్యార్థులు : 268 మంది

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు మొత్తం : 11


విద్యార్థులు: 1229 మంది

బీసీ వసతి గృహాలు : 14

విద్యార్థులు: 1159

సమస్యలు ఇవీ..

నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, మాచర్ల, చిలకలూరిపేట వంటి పట్టణాల్లో ఉండే పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. కొన్నింటికి సొంతభవనాలు లేవు. అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. ఫ్యాన్లు తిరగవు. కొన్నిచోట్ల అయితే ఫ్యాన్లను ధ్వంసం చేస్తున్నారు. స్విచ్‌బోర్డు ఊడిపోయి.. విద్యుత్తు తీగలు వేలాడుతూ భయంకరంగా ఉన్నాయి. కిటికీలు, తలుపులు ఊడిపోయాయి. మరుగుదొడ్ల సంగతి సరేసరి. ఆహారం కూడా నాణ్యత ఉండడం లేదని పలువురు చెబుతున్నారు. జిల్లా కేంద్రం రామిరెడ్డిపేటలో ఉండే వసతిగృహం పరిస్థితి తీసికట్టుగా ఉంది. ఎక్కడికక్కడ చెత్త.. మద్యం సీసాలు, సిగరెట్ పీకలు కనిపిస్తున్నాయి. వసతిగృహంలోకి అడుగుపెట్టగానే దుర్వాసన వస్తోంది. ఇలా ఉండబట్టే విద్యార్థుల సంఖ్య కూడా ఆయా వసతిగృహాల్లో రానురాను తగ్గిపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సందర్శించి గాడినపెట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పులి మళ్లీ వచ్చింది..!

వెల్దుర్తి మండల పరిధిలోని గొట్టిపాళ్ల బీట్‌లో పులి సంచరిస్తున్నట్లు విజయపురి సౌత్ రేంజర్ నరసింహారావు తెలిపారు. అడవి జంతువుల సంచారం తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కెమెరాల్లో నాలుగురోజుల కిందట పులి సంచరించినట్లు నమోదైంది. ఇప్పటికే పలుమార్లు పులి సంచారం కెమెరాల్లో రికార్డు అయింది. అటు వైపు ఎవరూ వెళ్లొద్దని రేంజర్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, వెల్దుర్తి

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన

నవంబరు 29 నాటికి ప్రక్రియ పూర్తి

ఈనాడు, అమరావతి

నాగార్జునసాగర్ ప్రాజెక్టు, కృష్ణా పశ్చిమ డెల్టా కింద రైతుల భాగస్వామ్యంతో రైతుప్రతినిధులను ఎన్నుకోవడానికి సాగునీటి సంఘాలకు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ప్రకటన ఇచ్చింది. సోమవారం జిల్లాల వారీగా ప్రకటనలు విడుదల కావడంతో ఓటర్ల జాబితా, ఎన్నికలు, ఎంపిక ప్రక్రియ మొత్తం నవంబరు 29నాటికి పూర్తి చేసేలా షెడ్యూల్ ప్రకటించింది. మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువల ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉండటంతో సమర్థులైన రైతులను కమిటీ ఛైర్మన్లుగా ఎన్నుకునే వెసులుబాటు ఉంది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. కాలువల నిర్వహణ, కనీస మరమ్మతుకు కూడా నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రకటన ఇచ్చి కమిటీల ఎంపిక ప్రక్రియకు మార్గం సుగమం చేసింది.

రైతు ప్రతినిధులతో కమిటీలు

కాలువల కింద 6 నుంచి 12 మంది ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ)గా గుర్తిస్తారు. ఇందులో భూమి కలిగిన ప్రతి ఆయకట్టుదారుడు ఓటరుగా ఉంటారు. అర్హులైన వారు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారుల వద్ద ఓటరుగా నమోదు చేసుకోవాలి. ప్రాదేశిక నియోజకవర్గంలోని సభ్యులందరూ నీటివినియోగదారుల

జిల్లాల వారీగా కమిటీల ఎన్నిక

సంఘాన్ని(డబ్ల్యూఏ) ఎన్నుకుంటారు. డబ్ల్యూఏ ఛైర్మన్‌గా ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఛైర్మన్లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌లు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌ను ఎన్నుకుంటారు. సాగర్ కాలువల కింద లింగంగుంట్ల, ఒంగోలు సర్కిళ్లు ఉన్నాయి. రెండు సర్కిళ్లకు కలిపి ఒకే ప్రాజెక్టు కమిటీ ఉంటుంది. పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని వారే ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికవుతారు. ఒంగోలు సర్కిల్ పరిధిలోని ఒంగోలు జిల్లా వారు ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవుతారు. అదేవిధంగా కృష్ణాపశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఆయకట్టు ఉంది. రెండు జిల్లాల్లో డబ్ల్యూఏ, డీసీలను ఎన్నుకుంటారు. బాపట్ల జిల్లాలో ఆయకట్టు ఎక్కువగా ఉన్నందున ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పదవి ఆ జిల్లా వాసులకు దక్కనుంది. ఉపాధ్యక్ష పదవి గుంటూరు జిల్లావాసులకు వస్తుంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో చిన్ననీటిపారుదల విభాగంలో 60 డబ్ల్యూయూఏలు ఉన్నాయి. ఇవి మైనర్ ఇరిగేషన్ కింద ఉన్నందున డబ్ల్యూఏలు మాత్రమే ఉంటాయి. చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో డీసీ, పీసీలు ఉండవు.



పల్నాడు జిల్లాలో 274 డబ్ల్యూఏలు

పల్నాడు జిల్లాలో సాగర్ కుడికాలువ కింద 219 డబ్ల్యూఏలు, చిన్ననీటిపారుదల విభాగంలోని చెరువుల కింద 55 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. మొత్తం 274 డబ్ల్యూఏలు ఉన్నాయి. వీరందరూ కలసి డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. పల్నాడు జిల్లాలో మొత్తం 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో సోమవారం ఎన్నికల ప్రకటన విడుదలైంది. సాగర్ కాలువల కింద కమిటీల్లో ఎంపిక కావడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

రైతేరాజు

బహుళ పంటలు.. లాభానికి మార్గాలు

మినుము పంట ఇలా కాపాడుకుందాం

6లో



20 గేట్ల నుంచి నీటి విడుదల

నాగార్జునసాగర్ జలాశయం 20 క్రస్టు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 1,59,900 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణాకు విడుదల చేస్తున్నారు. సాగర్ కుడి కాలువకు 9047, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 1800, లోలెవల్ కెనాల్‌కు 400, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 25,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 589.00 అడుగుల వద్ద కొనసాగుతోంది.

– విజయపురిసౌత్, న్యూస్‌టుడే

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

గుంటూరు, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024కి హాజరయ్యే షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం ఈనెల 25 వరకు పొడిగించినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదన్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను స్థానిక సచివాలయంలో 6 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుకు ఎంపిక చేస్తారన్నారు. https://jnanbhumi.ap.gov.in ధ్రువపత్రాలను జత చేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవంబరు 3న ఆన్‌లైన్‌లో ప్రాథమిక పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ సంస్థలకు కేటాయిస్తారని వివరించారు.

రైల్వే బోర్డు మార్గదర్శకాలు పాటించాలి

గుంటూరు రైల్వే: రైల్వే బోర్డు భద్రత విషయంలో నిర్దేశించిన మార్గదర్శకాలను అందరూ పాటించాల్సిందేనని ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. సికింద్రాబాద్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మండల రైల్వే అధికారి రామకృష్ణ ఇతర అధికారులతో మాట్లాడుతూ అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షాకాలంలో ట్రాక్ నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సరకుల రవాణా లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు.

ప్రతి ఫిర్యాదు పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 105 అర్జీలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్‌తో పాటు జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో వినాయకం అర్జీలు స్వీకరించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధుల హక్కులు కాపాడాలంటున్న జడ్పీటీసీలు

ప్రోటోకాల్ అమలు చేయాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులను పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు పలువురు జడ్పీటీసీలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలకు ఆహ్వానం అందడం లేదన్నారు. అలాగే అభివృద్ధి పనుల శిలాఫలకాలపైనా సంబంధిత ప్రజాప్రతినిధుల పేర్లు లేవని తెలిపారు. ప్రోటోకాల్ పాటించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జడ్పీటీసీలు పిల్లి ఓబులరెడ్డి, శివయాదవ్, మస్తాన్‌రావు, సునీత లక్ష్మి తదితరులు ఉన్నారు.

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ప్రత్యేక పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలని కోరుతూ దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజుపాలెం కేజీబీవీలో 230 మంది సరైన వసతులు లేవని తెలిపారు. అలాగే కలెక్టరేట్ వద్దనే ఉన్న ఎస్సీ వసతిగృహంలో 140 మందికి నాలుగే గదులు ఉన్నాయని పేర్కొన్నారు. మల్లెల చిన్నప్ప, వెంకటరమణ, కోటిరత్నం, పోలయ్యలు ఉన్నారు.

44 సెంట్ల భూమి ఆక్రమించారు

వైకాపా నేత పెదకూరపాడు మండలం జడ్పీటీసీ భర్త కంకణాల శివాజీ గారపాడులో రికార్డులు తారుమారు చేసి తమకు చెందిన 44 సెంట్ల భూమిని ఆక్రమించారని.. న్యాయం చేయాలని కోరుతూ రావడ పుల్లారావు, రావడ వెంకట్రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

'సమస్యలు ఆలకించి.. న్యాయం చేయండి'

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట సమయంలో వాటిని పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులను సూచించారు. నరసరావుపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు ఎస్పీని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి సంబంధమైన సమస్యలు అధికంగా వచ్చినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

గ్రానైట్ కొనుగోలు డబ్బు చెల్లించలేదు

నరసరావుపేట మండలం గురవాయపాలెం సమీపంలోని ఓ గ్రానైట్ కంపెనీలో పార్టనర్‌గా కుదిరి పని చేస్తున్నాను. మార్కాపురానికి చెందిన ఓ వ్యక్తి గ్రానైట్ బండలు కొని రూ.4,62,000 చెల్లించలేదు. మాయమాటలతో మోసగించి చెల్లని చెక్కు ఇచ్చాడు. అతనిపై చర్య తీసుకుని సొమ్ము ఇప్పించాలి.
-టి.శ్రీనివాసరావు, గ్రానైట్ కంపెనీ, గురవాయపాలెం


బాధితుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో దోపిడీ

కొద్ది నెలల క్రితం విడుదలైన ఆన్‌లైన్ యాప్‌లో ట్రేడింగ్ చేసేందుకు రూ.5.64 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఎక్కువ లాభం వచ్చినట్లు చూపడంతో నగదు తీసుకునేందుకు ప్రయత్నించా. అయితే ఇందుకు రూ.2 లక్షలు చెల్లించాలని యాప్ నిర్వాహకులు డిమాండ్ చేశారు. సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయడంతో ఆ మొత్తాన్ని సీజ్ చేశారు. సొమ్ము ఇప్పించాలని కోరుతున్నాను.
- లంకె అజయ్ కుమార్, దాచేపల్లి

వజ్రాల శుద్ధి పేరుతో సొమ్ము స్వాహా

మా గ్రామానికి చెందిన ఇద్దరు, వేమవరానికి చెందిన మరొకరు కలిసి వజ్రాలు శుద్ధి చేసేందుకు పెట్టుబడి పెట్టాలని, రెట్టింపు సొమ్ము ఇస్తామని నమ్మబలికారు. రూ.25 లక్షలు ఇచ్చాం. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసగించారు. వారిపై చర్య తీసుకుని సొమ్ము ఇప్పించండి.
-ఉషా నాయక్, తాళిబ్, పిన్నెల్లి, మాచవరం మండలం

లంచం తీసుకుని నకిలీ విడాకులు ఇచ్చారు..

కుటుంబ కలహాలతో భార్య, భర్తలు విడిపోయారు. విడాకుల కోసం ప్రభుత్వ ఖాజీ షేక్ రిజ్వాన్ సాయంతో విడాకుల ప్రక్రియ పూర్తి చేసుకున్నాం. అందుకు రూ.1.20 లక్షలు చెల్లించా. అయితే అవి నకిలీ విడాకుల పత్రాలు అని నిర్ధారణ అయింది. ప్రభుత్వ ఖాజీపై చర్య తీసుకోవాలని కోరుతున్నాను.
-వసీమ్ అక్రమ్, పిడుగురాళ్ల పట్టణం

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసగించాడు

తుళ్లూరు నారాయణ అనే వ్యక్తి నన్ను పరిచయం చేసుకుని మా పిల్లలకు ఒప్పంద, శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించాడు. అధికారులకు చెల్లించాలని చెబుతూ రూ.20 లక్షలు లంచం తీసుకున్నాడు. మోసగించాడని తెలుసుకుని అతని ఇంటికి వెళ్లి ప్రశ్నించాం. మాపై ఆధారాలే వేధింపుల కేసు పెడతానని బెదిరిస్తున్నాడు. న్యాయం చేయాలి.
-షేక్ సైదా, షంషాద్, మహబూబ్ బాషా, శ్రీలక్ష్మీ, శ్రీనివాసనగర్, నరసరావుపేట

సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలో 301 రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపడుతున్నామని, అందులో మండల స్థాయి ప్రత్యేక అధికారులు, వ్యవసాయాధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం గోడపత్రికలు, కరపత్రాలను ఆయన, జాయింట్ కలెక్టర్ సూరజ్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ ఎలుకల ద్వారా 10 నుంచి 40 శాతం దిగుబడి తగ్గుతుందని, ఆ నష్టాలను తగ్గించడానికి వరిసాగు చేసే 301 రైతు సేవా కేంద్రాల్లో, బంజారు, పోరంబోకు భూములు, ఇతర ప్రభుత్వ భూముల్లో ఎలుకల నివారణ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : వ్యక్తిగత సంబంధం నేపథ్యంలో పగ పెంచుకుని దాడి చేసిన ఘటన ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కంభంపాడుకి చెందిన కె.యేసుబాబు పట్టణంలో పారిశుద్ధ్య మేస్త్రీ. గతంలో పరిచయస్తురాలైన కొండపోగు సలోమిరాణితో అతను సన్నిహిత సంబంధం పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె కుమారులు నరేష్, దినేష్, తమ్ముడు కిరణ్‌కుమార్ యేసుబాబుపై పగ పెంచుకున్నారు. ఏడాది క్రితమే ఆమె చనిపోయింది. దీంతో యేసుబాబు కుటుంబంతో సంతోషంగా ఉండటం ఓర్వలేని ముగ్గురు ఆదివారం అర్ధరాత్రి అతనిపై దాడిచేసి కత్తులతో గాయపరిచారు. బంధువులు బాధితుడిని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బహుళ పంటలు.. లాభానికి మార్గాలు

యడ్లపాడు, న్యూస్‌టుడే

ప్రణాళిక ప్రకారం కష్టించి పని చేస్తే వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపించారు ఆ దంపతులు. ఉద్యాన సాగులో ఆటుపోట్లను అధిగమించి 15 ఏళ్లుగా రాణిస్తున్నారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన చేతలాలపల్లి శ్రీనివాసరావు, సుబ్బారావమ్మ దంపతులకు సొంత పొలం 3.5 ఎకరాలు ఉంది. దాని పక్కనే ఉన్న మరో ఎకరం కౌలుకు తీసుకున్నారు. ఉద్యాన పంటలకు అనుకూలమైన ఎర్రనేల కావటంతో పూలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. పొలంలో బోరు, బిందు సేద్య పరికరాలు ఏర్పాటు చేసుకుని సాగునీరు, ఎరువులు పొదుపుగా వాడుతున్నారు. నిత్యం దంపతులు సాగు పనులు చేస్తున్నారు. అంతర సేద్యం, పురుగు మందులు పిచికారీ, కూరగాయలు, పూలు సొంతంగా కోసుకుంటారు. అవసరమైనపుడే కూలీలను పెట్టుకుంటారు. దిగుబడుల నిల్వకు పొలంలోనే ఓ గది నిర్మించారు. చేను వద్ద అమ్మగా మిగిలిన దిగుబడిని గుంటూరు, చిలకలూరిపేట మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు.


తోటలో బంతిపూలు కోస్తున్న శ్రీనివాసరావు

సాగులో తొమ్మిది అంతర పంటలు

పొలంలో బోరు బావి, బిందు సేద్య పరికరాలను శ్రీనివాసరావు ఏర్పాటు చేసుకున్నారు. వాటి ద్వారా సాగునీరు, ఎరువులు పొదుపుగా వాడుతున్నారు. బొప్పాయి, మునగ, బంతి, చిక్కుళ్లు, టమాటా ప్రధాన పంటలుగా సాగు చేశారు. అందులో అంతర పంటలుగా చామంతి 25 సెంట్లు, కనకాంబరం 25 సెంట్లు, కాకర 35 సెంట్లు, దోస 25 సెంట్లు సాగు చేశారు. ఈ ఏడాది అన్ని రకాల పంటలకు రూ.1.5 లక్షలు ఖర్చు చేశారు. కూరగాయల పంటలు దిగుబడికి సిద్ధంగా ఉన్నాయి. బంతి పూలు నాలుగు నెలలుగా దిగుబడి వస్తోంది. వాటిని చేను వద్దకు వచ్చి కిలో రూ.35 కొంటున్నారు. బంతిసాగుపై పెట్టిన ఖర్చులు పోగా ఇప్పటికి రూ.5 వేలు ఆదాయం వచ్చింది. ఇటీవల కనకాంబరం పూల దిగుబడి ప్రారంభమైంది. ప్రస్తుతం మార్కెట్‌లో కనకాంబరం ధర కిలో రూ.1500 ఉంది. దాని పెట్టుబడి తీరి ఇప్పటికి రూ.10 వేల ఆదాయం వచ్చింది. కార్తిక మాసం కావటంతో ఇదే ధర కొనసాగితే లాభాలు వస్తాయని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంతవరకు నష్టం రాలేదు

పూలు, కూరగాయల సాగు ఎంచుకున్నాను. అన్ని రకాల కూరగాయలు, పూలతోటలు సాగు చేస్తున్నా. ఒక్కోసారి కూరగాయల ధరలు అమాంతం పడిపోతాయి. అన్ని రకాల కూరగాయలు పండిస్తుండటంతో ధర ఉన్న పంటల్లో వచ్చిన ఆదాయంతో నష్టాన్ని భర్తీ చేసుకుంటున్నాను. ఏడాదిలో చివరిలో లెక్క చూసుకుంటే ఆదాయమే తప్ప నష్టపోలేదు. అన్ని రకాల పంటలపై ఖర్చులు పోగా ఏడాదికి సుమారుగా రూ.1.5 లక్షల ఆదాయం వస్తుంది. - శ్రీనివాసరావు, రైతు

రైతేరాజు

మినుము పంట ఇలా కాపాడుకుందాం

కొల్లూరు, న్యూస్‌టుడే : జిల్లాలో నాలుగైదు రోజులు కుండపోతగా కురిసిన వర్షానికి మినుము పంట పాక్షికంగా దెబ్బతింది. 20 నుంచి 30 రోజుల వయసు కలిగి ఉన్న పంట పలు చోట్ల ఎదుగుదల మందగించి, మొక్కల ఆకులు ఎరుపు, తెలుపు రంగులోకి మారాయి. రైతులకు కొల్లూరు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సస్యరక్షణ చర్యలు వివరించారు.



❖ పొలంలో వర్షం నీరు నిలిస్తే వాటిని బయటకు పంపాలి. వర్షాలు తగ్గాక లీటరు నీటిలో ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, యూరియా 20 గ్రాములు కలిపి ఎకరం పొలంలో పంటపై మొక్కలు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి. తద్వారా ఉరక వల్ల మొక్కల పెరుగుదల నిలిచిపోకుండా కాపాడుకోవడంతో పాటు ఇనుప ధాతు లోపాన్ని నివారించుకుని, మొక్కలు తెలుపు రంగులోకి మారకుండా ఉంటాయి. పైరు పెరుగుదలకు ఈ ప్రక్రియ దోహదం చేస్తుంది. ❖ పై మిశ్రమాన్ని పిచికారీ చేసిన వారం తర్వాత 19-19-19 లేదా కేఎన్‌ఓ- 3 (13.0.45) ఒక శాతం మొక్కలపై పిచికారీ చేయాలి. అనంతరం వేరు కుళ్లు, ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటిలో హెక్సాకోనోజోల్- 2 మిల్లీ లీటర్లు, లేదా ప్రొపికోనాజోల్ మిల్లీ లీటరు కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేయాలి. ❖ తదుపరి మారుక మచ్చల పురుగు నివారణకు లీటరు నీటిలో క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా నోవాల్యురాన్ 1 మిల్లీ లీటరు కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేసుకోవాలి. ఇలా చేస్తే పంటను కాపాడుకోవచ్చు.


జువ్వలపాలెం వద్ద వర్షం నీటితో మినుము చేను

పశువులలో పొదుగు వ్యాధి వ్యాప్తి.. ప్రధాన కారణాలు

వినుకొండ, న్యూస్‌టుడే

పశువుల్లో పొదుగు వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో వ్యాప్తి చెందుతుంది. దీని వల్ల పాల దిగుబడి తగ్గడంతో పాటు నాణ్యత లోపిస్తుంది. సకాలంలో గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే నష్ట నివారణ సాధ్యమేనని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు పి.శ్రీనివాసమూర్తి తెలిపారు. పాల ఉత్పత్తిని ప్రభావితం చేసే ఈ వ్యాధిపై పశు పోషకులకు అవగాహన కోసం ఆయన పలు సూచనలు చేశారు.

❖ తగినంత పరిశుభ్రత, సరైన వైద్యసేవలు లేకపోవడం వ్యాధి రావడానికి ప్రధాన కారణం. అధిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సంకర జాతి ఆవుల్లో ఎక్కువగా దీన్ని గమనించవచ్చు. పశువు ఈనిన 30- 90 రోజుల వ్యవధిలో వ్యాధి సోకే అవకాశాలున్నాయి. పొదుపు వాపు లక్షణాలను బట్టి రెండు దశలుగా వర్గీకరిస్తారు. క్లినికల్ దశలో జబ్బును గుర్తించడం సులువు కనుక తక్షణం చికిత్స చేయవచ్చు. సబ్ క్లినికల్ దశలో లక్షణాలు కనిపించవు కనుక దాన్ని గుర్తించడానికి శాస్త్రీయ పర్యవేక్షణ అవసరం. దీని వల్ల పాల ఉత్పత్తి సుమారు 49శాతం తగ్గుతుంది.

నివారణ చర్యలు : పశువులుండే షెడ్డు, గాలి వెలుతురు సక్రమంగా వచ్చే విధంగా నిర్మించాలి. ఫ్లోరింగ్ ఎల్లప్పుడూ పొడిగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి రోజు పరిశుభ్రం చేయాలి. సీఎంటీ, డబ్ల్యూఎస్‌టీ, ఎస్ఎఫ్ఎంటీ పరీక్షల ద్వారా పొదుపు వాపు గుర్తించవచ్చు.

రైతు ప్రశ్న: రబీలో ఎర్ర సెనగ సాగుకు అనువైన వంగడాలతో పాటు ఎండు తెగులు, వేరు తెగుళ్ల నివారణ మార్గాలు ఏమిటి? **–లక్ష్మీనారాయణ, వెనిగండ్ల, పెదకాకాని మండలం**

శాస్త్రవేత్త సమాధానం: ఎన్‌బీఈజీ-776 రకం ఎండు తెగులును తట్టుకుని యంత్ర కోతకు అనువుగా ఉంటుంది. ఎన్‌బీజీ-779, ఎన్‌బీజీ-452 రకాలు ఎండు తెగులును తట్టుకుంటాయి. కిలో సెనగ విత్తనాన్ని 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో శుద్ధి చేసుకుంటే వేరుకుళ్లును సమర్థంగా అరికట్టవచ్చు. సెనగలో ఎండు తెగులు నివారణకు ఎకరానికి 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి పొడిని, 2 కిలోల వేపపిండిని 90 కిలోల పశువుల ఎరువును కలిపి నీడలో కుప్పలా చేసుకుని తగిన తేమ కోసం నీటిని చిలకరించుకుంటూ 20 రోజులకు తెల్లటి బూజు ఏర్పడిన తర్వాత ఆఖరి దుక్కిలో చల్లుకోవాలి. ఎన్‌బీజీ-776, 779, 452 తదితర రకాలను సాగు చేసుకున్నట్లయితే ఎండు తెగులును సాధ్యమైనంత వరకు నివారించవచ్చు.

- డాక్టర్ ఎం.నగేష్, గుంటూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త - న్యూస్‌టుడే, జిల్లాపరిషత్తు(గుంటూరు

15 ఏళ్లుగా ప్రభుత్వ భూమిని కాపాడే యత్నం

ఇంతవరకూ కరుణించని అధికారులు

ఆ భూమి తనది కాదు.. ఆ సమస్య కూడా తనది కాదు.. అయినా సరే 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారు.. వయసు మీదపడుతున్నా.. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరవుతున్నారు. అంతేకాదు.. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌లో కూడా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని.. కాపాడండి మహాప్రభో అంటూ పోరాడుతున్నారు. అతనే నాదెండ్ల మండలం గణపవరం నివాసి ఆవుల సాంబశివరావు. వయసు 75కు పైనే ఉంటుంది. 30 సెంట్ల ప్రభుత్వ భూమిని కాపాడాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 'నాదెండ్ల మండలం గణపవరం గ్రామ కంఠం సర్వే నంబరు 216లో కాలువ పోరంబోకు భూమి ఉంది. దీనికి ఆర్ఎస్ఆర్ కాపీ, గ్రామ పఠం, ఎఫ్ఎంబీ, అడంగల్ అన్ని ఆధారాలూ ఉన్నాయి. డొంక పోరంబోకు 95 సెంట్ల భూమిలో గతంలోనే గ్రామపెద్దలు పోలేరమ్మ దేవాలయం నిర్మించారు. ఇదే స్థలంలో 1985లో పోలేరమ్మ దేవాలయానికి ముందు భాగంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కట్టారు. దీనికి తూర్పు భాగంలో కాలువ పోరంబోకు 30 సెంట్ల భూమిని ఓ ముగ్గురు ఆక్రమించారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఆక్రమణ స్థలంలో పాఠశాలకు సంబంధించి మైదానం, అదనపు తరగతులు, వంట గది నిర్మించొచ్చు' అని 2009 నుంచి 15 ఏళ్లుగా ఎందరో కలెక్టర్లకు ఆవుల సాంబశివరావు అర్జీలు పెడుతున్నారు. ప్రస్తుత కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఒకప్పుడు నరసరావుపేట ఆర్డీవోగా పనిచేసినప్పుడు కూడా సమస్యను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయం కూడా ప్రస్తుతం కలెక్టర్‌కు ఆయన ప్రస్తావించారు. ఉన్నతాధికారిఇ కూడా ఇంతవరకూ పరిష్కారం కాలేదా? అన్నారు.


ఆవుల సాంబశివరావు

- ఈనాడు డిజిటల్, నరసరావుపేట


ధ్యానబుద్ధ ఘాట్ వద్ద..


టెయిల్‌పాండ్ 14 గేట్ల నుంచి నీటి విడుదల

నిండుకుండలా కృష్ణమ్మ

అమరావతి, న్యూస్‌టుడే: ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నది నిండుకుండలా ప్రవహిస్తోంది. పులిచింతల నుంచి రెండు లక్షల క్యూసెక్కులకుపైగా నీరు విడుదల చేస్తున్నారు. ధ్యానబుద్ధ ఘాట్, అమరేశ్వరఘాట్ వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉంది.

2.13 లక్షల క్యూసెక్కులు విడుదల

రెంటచింతల: సత్రశాల విద్యుత్తు టెయిల్ పాండ్ జలాశయంలో సోమవారం 2.13 లక్షల క్యూసెక్కుల వరద నీరు నాగార్జునసాగర్ నుంచి వచ్చి చేరుతున్నట్లు జెన్‌కో ఎస్ఈ వెంకటరమణ వెల్లడించారు. జలాశయం 13 క్రస్టుగేట్లు 3 మీటర్లు, మరో గేటు 2.5 మీటర్ల ఎత్తు ఎత్తి దిగువనున్న పులిచింతల ప్రాజెక్టుకు 2.13 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరించారు. రిజర్వాయరు నీటి నిల్వ సామర్థ్యం 75.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 75.07 మీటర్ల మేర నిల్వ చేశారు.

కొనసాగుతున్న వరద

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి సోమవారం రాత్రి 7 గంటలకు 7 రేడియల్ గేట్లు మూడు మీటర్ల ఎత్తు ఎత్తి 1,67,190 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తికి 16,000 క్యూసెక్కులు దిగువ ప్రకాశం బ్యారేజీకి వదిలినట్లు ఏఈఈ రాజు తెలిపారు. ఎగువ నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నుంచి 1,83,190 క్యూసెక్కులు వచ్చి చేరిందన్నారు.

అతిసారంతో వృద్ధురాలి మృతి

కారంపూడి, న్యూస్‌టుడే: మండలంలోని చినగార్లపాడులో అతిసార వ్యాధి ప్రబలి వాసాల మహాలక్ష్మమ్మ (70) సోమవారం మృతి చెందింది. గ్రామంలో గత మూడురోజులుగా వ్యాధి ప్రబలటంతో పదుల సంఖ్యలో గ్రామస్థులు అస్వస్థతకు గురైయ్యారు. వీరిలో కొంత మంది పిడుగురాళ్లలోని ప్రైవేట్ వైద్యశాలల్లో వైద్యం చేయించుకుంటుండగా మరి కొంతమంది కరాలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామానికి బత్తుల వీర్లవెంకయ్య, ఓర్సు అనురాధ, శివనాగులు చికిత్స పొందుతున్నారు. వర్షాలకు బోర్లలో కొత్తనీరు చేరటంతో గ్రామంలో అతిసార ప్రబలినట్లుగా ఆరోగ్య సిబ్బంది పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది గ్రామంలోని మురుగుకాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పిచికారి చేశారు.


మహాలక్ష్మమ్మ (పాత చిత్రం)

తెదేపా మద్దతుదారులపై దాడి

ముగ్గురికి గాయాలు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: పాత గొడవలతోపాటు ఇంటి వద్ద జరిగిన చిన్న వివాదం నేపథ్యంలో తెదేపా మద్దతుదారులపై వైకాపా మద్దతుదారులు దాడిచేసి గాయపర్చిన ఘటన మండలంలోని తొండపి ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సోమేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన తెదేపా మద్దతుదారుడు బోరుపోతు నాగేశ్వరరావు ఇంటి ముందు పని చేస్తుండగా.. సాయం చేస్తామని ఎదురింట్లో ఉంటున్న వైకాపా మద్దతుదారులు చింతిరాల సుధీర్, అశోక్ అడిగారు. ఎవరి సాయం తీసుకోవాలో తనకు తెలుసంటూ నాగేశ్వరరావు చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం విషయాన్ని సుధీర్ తన వర్గం వారికి చెప్పడంతో వారు అక్కడికి చేరుకుని గొడవపడ్డారు. ఈక్రమంలో నాగేశ్వరరావు, యోధ, బిక్షాలుపై కర్రలు, రాళ్లు, మారణాయుధాలతో దాడిచేసి గాయపర్చారు. క్షతగాత్రులను సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సుధీర్‌తోపాటు మరో 10 మందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వృద్ధాశ్రమానికి కారు వితరణ


కారును అందిస్తున్న జోయాలుక్కాస్ సంస్థ ప్రతినిధులు ప్రజోష్, బాజి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమంలో వృద్ధులు, మానసిక దివ్యాంగులను వైద్యసేవల నిమిత్తం ఆసుపత్రులకు తరలించేందుకు వీలుగా గుంటూరు పట్టణంలో ప్రముఖ నగల దుకాణం జోయాలుక్కాస్ కారును సమకూర్చింది. రూ.6.84 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన కారును నిర్వాహకులు అల్లం ఇన్నారెడ్డి, శాంతిలకు జోయాలుకాస్ సంస్థ ప్రతినిధులు ప్రజోష్, బాజి అందించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, రిటైల్ ధర - 155, చికెన్ విత్‌స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్ - 256.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు : ఒకరి దుర్మరణం


న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న ఆరేపల్లివాసులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే : మండలంలోని బుచ్చిపాపన్నపాలెం వద్ద రహదారి ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రొంపిచర్ల మండలం ఆరేపల్లికి చెందిన బత్తుల శివ(46) ఆదివారం ద్విచక్ర వాహనంపై నరసరావుపేట బయలుదేరాడు. బుచ్చిపాపన్నపాలెం సమీపంలోకి రాగానే పట్టణం నుంచి ఆరేపల్లి ముప్పాళ్ల వైపు వెళుతున్న ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల బస్సు అతని వాహనాన్ని ఢీకొనగా శివ తలకు తీవ్రగాయమై అక్కడే మృతి చెందాడు. మృతునికి ముగ్గురు సంతానం, భార్య ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు అతని కుటుంబానికి న్యాయం చేయాలని సంఘటన స్థలంలో ధర్నా చేశారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై అశోక్ వారితో చర్చించారు. కళాశాల యాజమాన్యం వచ్చి న్యాయం చేయాలని చెప్పగా ధర్నా విరమించారు.


శివ (పాతచిత్రం)

అయ్యప్ప భక్తులకు అన్నదానం

దాచేపల్లి, న్యూస్‌టుడే: అయ్యప్ప మండల దీక్ష చేస్తున్న భక్తులకు దాచేపల్లి అంకమ్మ తల్లి ఆలయం వద్ద మండల నాయకులు అంబటి నవకుమార్, యలమల నరేష్, గ్రామ పెద్దల సహకారంతో సద్ది కార్యక్రమం ప్రారంభించారు. 41 రోజుల పాటు సద్ది కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.


సద్ది కార్యక్రమంలో భక్తులు

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

రైఫిల్ షూటింగ్‌లో విద్యార్థినుల ప్రతిభ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న రాజమహేంద్రవరంలో నిర్వహించిన అండర్-19 రైఫిల్ షూటింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆస్మాపర్వీన్, సర్విన్, మౌనిక ప్రతిభ కనబర్చారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ప్రధానోపాధ్యాయిని మాధవీలత, పీడీలు సునీత, శివగోవర్ధన, పీఈటీ పీఎస్ఆర్ శాస్త్రి తదితరులు అభినందించారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

మాచవరం, న్యూస్‌టుడే: ఆధార్ కార్డులో వివరాలు మార్పు చేసుకునేందుకు నేటి నుంచి 24 వరకు మాచవరం, గంగిరెడ్డిపాలెం, మోర్జంపాడు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? లింగాపురం ఎస్సీ కాలనీలో రోడ్డు వెంట చెత్త వేస్తున్నారు. దుర్గంధంతోపాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - **కాలనీ వాసులు**

✔ చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య నిర్వహణ చేపడతాం. - **బిక్కి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, లింగాపురం - న్యూస్‌టుడే, అమరావతి**

? బంగారుతండా వద్ద రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. మురుగు కాలువ నిర్మించాలి. - **కృష్ణానాయక్, బంగారుతండా**

✔ త్వరలో కాలువ నిర్మిస్తాం. - **పున్నారావు, ఏఈ - న్యూస్‌టుడే, అచ్చంపేట**

? మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. - **మండాది గ్రామస్థులు**

✔ మురుగు సమస్యకు పరిష్కారం చూపుతాం. - **ప్రసాద్, కార్యదర్శి**

? తండాలో వీధి దీపాలు వెలగడంలేదు. - **రామమ్‌నాయక్, శ్రీరాంపురంతండా**

✔ త్వరలో ఏర్పాటు చేయిస్తాం. - **ప్రసాద్, కార్యదర్శి - న్యూస్‌టుడే, వెల్దుర్తి**

? లింగంగుంట్ల ప్రధాన రహదారిలో విద్యుత్తు తీగలకు చెట్టుకొమ్మలు అల్లుకుపోయి ప్రమాదం పొంచి ఉంది. - **వీరపనేని మురళి, గ్రామస్థుడు**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. వారం వ్యవధిలో పరిష్కరిస్తాం. - **విద్యుత్తు శాఖ అధికారి - న్యూస్‌టుడే, పెదకూరపాడు**

ఆధ్యాత్మిక కేంద్రం.. ఆతిథ్యం దూరం..!

అమరావతిలో మూతపడిన గృహాలు

అమరావతి, న్యూస్‌టుడే

పర్యాటక కేంద్రం.. పంచారామ క్షేత్రంగా వెలుగొందుతున్న అమరావతిలో ప్రభుత్వ అతిథి గృహాలు అధ్వానంగా మారాయి. నిర్వహణలేక మూతపడ్డాయి. ఎంతో మంది వీవీఐపీలు వసతి పొందిన గృహాలను అధికారులు గాలికి వదిలేశారు. అమరేశ్వరాలయం సమీపంలోని శాంతి ధామం, వైకుంఠపురం వద్ద అతిథి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నేళ్లుగా గేట్లు తాళాలు కూడా తెరుచుకోలేదు.

శాంతిధామం మూత

అమరావతికి వచ్చే ప్రముఖుల వసతి కోసం పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో శాంతిధామం అతిథి గృహాన్ని నిర్మించారు. దీన్ని కొన్నాళ్లు ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇచ్చారు. మళ్లీ పంచాయతీరాజ్ శాఖ స్వాధీనం చేసుకున్నా.. నిర్వహణ గాలికి వదిలేశారు. పర్యాటకులు కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు చేసినా అందుబాటులోకి తీసుకురాలేదు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాసరావును వివరణ అడగ్గా.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.





ఆనాటి వైభవం ఏదీ?

ఎంతోమంది అతిథులకు ఆతిథ్యం ఇచ్చిన వైకుంఠపురం అతిథి గృహం వైభవం కోల్పోయింది. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో తాళాలు వేశారు. 1980లో కృష్ణా పుష్కరాల సమయంలో దాతల సహకారంతో ప్రభుత్వం భవనాన్ని నిర్మించింది. అప్పట్నుంచి రెవెన్యూ శాఖ పరిధిలో ఉంది. 2006లో ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం, బౌద్ధ గురువు దలైలామా అమరావతిలో జరిగిన కాలచక్ర మహాసభలకు హాజరై వైకుంఠపురం అతిథి గృహంలో బసచేశారు. ఇలా ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులు, సినీనటులకు ఆతిథ్యం ఇచ్చిన భవనం నేడు శిథిలావస్థకు చేరింది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పాడుబడింది. విలువైన ఫర్నీచర్‌ను కొందరు మాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

పట్టభద్రులూ.. గడువు 16 రోజులే!

★ ఓటు నమోదుకు రండి ★ దరఖాస్తుకు కానరాని స్పందన


పెదకూరపాడులో ఓటు నమోదు చేసుకుంటున్న క్రోసూరు సీఐ సురేష్

బెల్లంకొండ, పెదకూరపాడు, అచ్చంపేట(క్రోసూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో 30 శాతం కంటే ఎక్కువగా ఉన్న పట్టభద్రులు ఓటు నమోదు విషయంలో ఆసక్తి చూపడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటు నమోదు ప్రక్రియ చేపట్టారు. దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా స్పందన అంతంత మాత్రమే. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు పది వేలకుపైగా పట్టభద్రులు ఉన్నా.. దరఖాస్తు చేసేందుకు ముందుకురావడం లేదు.

గెజిటెడ్ సంతకాలతో సమస్య

పట్టభద్రుల ఓట్ల నమోదుకు దాఖలు చేస్తున్న పత్రాలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాల్సి ఉంది. అసలు ధ్రువపత్రం, నకళ్లను పట్టుకుని గెజిటెడ్ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇది ఇబ్బందికరంగా మారింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత నకళ్లను అప్‌లోడ్ చేసినా పరిశీలన పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పడం ఎంతవరకు సమంజసమని పలువురు పట్టభద్రులు ప్రశ్నిస్తున్నారు.

నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ఇలా...

మండలం	నేరుగా దరఖాస్తులు	ఆన్‌లైన్ ద్వారా	మొత్తం
అచ్చంపేట	12	310	322
బెల్లంకొండ	14	190	204
క్రోసూరు	2	327	329
పెదకూరపాడు	100	354	454
అమరావతి	23	456	479
మొత్తం	151	1637	1788

ప్రత్యేక కేంద్రాలు..

శాసనమండలి ఓటు హక్కు దరఖాస్తు పత్రాలు అందించేందుకు ప్రతి మండలంలోనూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. తహసీల్దారు, మండల పరిషత్తు, విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంది. నవంబరు 6 తుది గడువుగా నిర్ణయించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు.

విద్యార్థుల అదృశ్యం

దాచేపల్లి: దసరా సెలవుల తర్వాత తన కుమారుడు కనిపించటం లేదంటూ చిన్న అగ్రహారం గ్రామానికి చెందిన భ్రమరాంబ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసానుపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శ్రీహరి పదో తరగతి చదువుతున్నాడు. అక్కడే హాస్టల్లో ఉంటున్నారు. దసరా సెలవుల తరువాత ఆటో ఎక్కి పాఠశాలకు వెళుతున్నట్లు చెప్పి బయలుదేరాడు. ఆ తర్వాత కనిపించకుండా పోయాడు.

అమరావతి: అమరావతిలోని ఓ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అదృశ్యంపై స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పదో తరగతి చదువుతున్న బాలుడు, బాలిక ఉదయం నుంచి కనిపించక పోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

గురజాల గ్రామీణ: గురజాల పరిసర ప్రాంతానికి చెందిన ఓ మహిళ రెండ్రోజుల కిందట అదృశ్యమైంది. ఆమె బంధువులు పోలీసులను ఆశ్రయించారు.

కేంద్ర పథకాల అమలుపై ఆరా



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ బాలూనాయక్

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల అమలు తీరుపై జాతీయ స్థాయి పరిశీలన బృందం లింగాపురం గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. బృందం పరిశీలకుడు లోహిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ 11 పథకాలపై ఆరా తీశారు. ఉపాధి హామీ, గృహ నిర్మాణాలు, పింఛన్లు, స్వయం సహాయక బృందాలకు రుణాలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. డీఆర్డీఏ పీడీ బాలూనాయక్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చొరవచూపేలా మహిళలు ఎదగాలన్నారు. ఎంపీడీవో ఫణికుమార్, శ్రీరాములురెడ్డి, సిద్ధలింగమూర్తి, హీరాలాల్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ చిరస్మరణీయమని ఎస్సై వినోద్ అన్నారు. గురజాలలో సోమవారం పోలీసుల అమరవీరులను స్మరించుకుంటూ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

సత్తెనపల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి గ్రామీణ పోలీసులు పట్టణంలోని పరివర్తన ఆశ్రమ పాఠశాల చిన్నారులకు సోమవారం అన్నదానం చేశారు. అమరవీరులకు చిన్నారులతో కలసి నివాళులర్పించారు. గ్రామీణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై అమీనుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పెదకూరపాడు: ప్రజల భాగస్వామ్యంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమని పెదకూరపాడు ఎస్సై గిరిబాబు అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం కాకతీయ, అభినందన వివేకానంద కళాశాల విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు.


గురజాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


సత్తెనపల్లిలో నివాళులర్పిస్తున్న పోలీసులు, విద్యార్థులు

సమస్యలపై ఏకరవు

ప్రజాదర్బార్‌కు స్పందన

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: ప్రజాదర్బార్‌లో ప్రజలు తెలియజేసిన సమస్యల్ని ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశించారు. సోమవారం క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. మండల ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఎమ్మెల్యే పరిశీలించి ఆయా శాఖల అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని కోరారు. 190 అర్జీలు రాగా.. అందులో 90 వరకు భూ సమస్యలకు సంబంధించినవే. అలాగే విద్యుత్తు సమస్యలు అధికంగా వచ్చాయని ఎంపీడీవో మహేష్‌బాబు పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, అధికారులు

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఉపాధి పథకం ద్వారా ప్రతి కూలీకి పని కల్పించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఉపాధి పథకం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా చూడాలని, అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచేలా మొక్కలు నాటించి సంరక్షించాలన్నారు. అనంతరం అతిథి గృహాన్ని పరిశీలించి మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ బాలూనాయక్, జాతీయ స్థాయి పరిశీలకులు లోహిత్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, ఎంపీడీవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

మాచవరం: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలించేందుకు కేంద్ర బృందం మంగళవారం మాచవరం మండలంలో పర్యటించనుంది. ఉపాధి హామీ పథకం నిధులతో గంగిరెడ్డిపాలెం, శ్రీరుక్మిణీపురంలో నిర్మించిన గ్రామ సచివాలయాలు, సిమెంట్ రహదారులు, పండ్ల తోటల పెంపకం ఇతర పనులు పరిశీలించి, గ్రామస్థులతో బృంద సభ్యులు సమావేశమవుతారని ఏపీవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గుంత పూడ్చివేత

స్పందనకు వందనం

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్తెనపల్లి రహదారి కూడలిలో ఏర్పడిన గుంతలను పూడ్చారు. గుంతలతో తలెత్తుతున్న ఇబ్బందులపై ఈ నెల 15న 'ఈనాడు'లో 'నడిరోడ్డుపై గుంత ప్రయాణికుల చింత' శీర్షికన ప్రచురితమైన చిత్రవార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం గుంతలకు రాళ్ల మట్టి తోలి పూడ్చారు.

మురుగు కష్టాలకు చెల్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని 10వ వార్డు వాసులు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న మురుగు నీటి కష్టాలు తొలగిపోనున్నాయి. కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంపై 'నిధులున్నా.. నిర్లక్ష్యమే' శీర్షికన ఈనెల 12న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. రూ.4.50 లక్షల నిధులతో మూడు కల్వర్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. పనులు చకచక జరుగుతున్నాయి.

బాధితులకు పరామర్శ

పిడుగురాళ్ల: తెదేపా ముస్లిం మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ సోదరి షేక్ నసీమూన్ అనారోగ్యంతో మృతి చెందారు. యరపతినేని సాయినిఖిల్ వారి గృహానికి వెళ్లి పరామర్శించారు.

★ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని యరపతినేని సాయినిఖిల్ చెప్పారు. జానపాడురోడ్డు ప్రాంతంలో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు

నియంత్రికను చుట్టేసిన తీగలు

తంగెడ గ్రామంలో పెద్దబావి వీధికి వెళ్లే దారి పక్కన విద్యుత్తు మినీ నియంత్రికను తీగలు, పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. తక్కువ ఎత్తులో ఉండటం.. మొక్కలు అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, దాచేపల్లి



కాలువ నిండా చెత్తే

రెక్కాడితే గాని డొక్కాడని దినసరి కూలీలు నివాసముండే కొండమోడులో సైడు కాలువలు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పార్వతీపురం, టీఎన్‌నగర్, వీరమ్మకాలనీల్లో అక్కడక్కడ ఉన్న కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమలు విజృంభిస్తున్నాయని, అధికారులు స్పందించి కాలువల్లో చెత్త, ఇతర వ్యర్థాలు తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కొండమోడు (రాజుపాలెం)**



అచ్చంపేటలో సమస్యలెన్నో..!

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం అచ్చంపేటలో ఏళ్లతరబడి మురుగు సమస్యకు పరిష్కారం లేదు. మరోవైపు ట్రాఫిక్ సమస్య తీరడం లేదు. రాజీవ్‌కాలనీలో మురుగు కాలువలు లేక వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్లపైనే నీరు నిలుస్తోంది. అపరిశుభ్రత కారణంగా దోమలు ప్రబలుతున్నాయి. కాలనీలో ఆరు లైన్లు, 400 నివాస గృహాలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షలతో మధ్యలైన్ నుంచి మురుగు కాలువ శ్మశానం వైపు మళ్లించి నిర్మించారు. అది ఎగువ ప్రాంతం కావటం, నిర్మించిన కాలువ లోతు ఎక్కువగా ఉండటంతో నీరు పారడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారిలోని సినిమాహాలు కూడలి, విద్యుత్తు ఉపకేంద్రం, ఎన్నెస్పీ కార్యాలయాల్లోకి వర్షపు నీరు ప్రవహిస్తూ రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అచ్చంపేట ప్రధాన రహదారి, అమరావతి రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. సాయంత్రం వేళ విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయంలో రాకపోకలకు కష్టాలు తప్పడం లేదు. సామాజిక మరుగుదొడ్లు లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, మహిళలు అవస్థలు పడుతున్నారు. వీరభద్రస్వామి కాలనీలో అంతర్గత రహదారులు లేక కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అచ్చంపేటలో వీధి కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉంది.


ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య

గాదెవారిపాలెంలో ఘర్షణ

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు మండలం గాదెవారిపాలెంలో తెదేపా, జనసేన వర్గీయులు ఆదివారం అర్ధరాత్రి గొడవపడ్డారు. మురుగు కాలువ శుభ్రం చేసే విషయంపై దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వారంతా సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలు జనసేన నాయకులు చేపట్టారు. ఈక్రమంలో కాలువలో మురుగు తొలగిస్తుండగా. . తెదేపా నాయకుడు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి దాడులకు దిగారు. దాడిలో గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గాదె సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేస్తున్నట్లు క్రోసూరు ఎస్సై కె.నాగేంద్రరావు తెలిపారు. అయితే ఇరుపార్టీల నాయకులు ప్రజాప్రతినిధి సమక్షంలో రాజీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.



గాయపడిన సూర్యనారాయణ వేణుగోపాల్

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

దాచేపల్లి: ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిడుగురాళ్ల ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. సోమవారం దాచేపల్లి ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. దుకాణాల్లో నిల్వలకు సంబంధించి రిజిస్టర్ ఉంచాలన్నారు. అమ్మకపు బిల్లులపై రైతుల సంతకాలు తీసుకోవాలని, లైసెన్స్ గడువు ముగిసేలోపే రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు.

పిడుగురాళ్ల: ఎరువులు అధిక ధరకు అమ్మితే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.

నేడు ఎలుకల నిర్మూలన కార్యక్రమం

బెల్లంకొండ, నకరికల్లు, న్యూస్‌టుడే: మండలంలో వరి సాగు చేస్తున్న అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఎలుకల నిర్మూలనకు విషపు ఎర తయారు చేసి రైతులకు ఇస్తారన్నారు. ఇందుకు అవసరమైన నూకలు, శనగనూనె రైతులు తీసుకుని వస్తే ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే బ్రోమోడియాలిన్ కలిపి ఇస్తారన్నారు.

పాత పాలసీ విధానాన్ని కొనసాగించాలి

గురజాల గ్రామీణ: ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని, పాత పాలసీ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ గురజాల ఎల్ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఏజెంట్లు నిరసన తెలియజేశారు. ఎల్ఐసీ బీమాలు దెబ్బతీసే చర్యలు మానుకోవాలని కోరారు కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రామచంద్రరావు, ముసలారెడ్డి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

భాజపాలో చేరిక

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని చింతపల్లి, కోనూరుకు చెందిన పది మంది వైకాపా నుంచి భాజపాలో చేరినట్లు భాజపా మండల అధ్యక్షుడు లక్ష్మాచారి తెలిపారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు వారికి కండువాలు కప్పి భాజపాలోకి ఆహ్వానించారు.

ఊరంతా బురదే..


తుమ్మకోటలో చెరువును తలపిస్తున్న బజారు


మల్లవరంలో వీధి ఇలా..

వర్షాలు పడటంతో మండలంలోని అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో నిధుల కొరత సాకుతో కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. తుమ్మకోటలో ఏ వీధి చూసినా వర్షం, మురుగు నీరు నిల్వ చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు వీధుల వెంట ప్రవహిస్తోంది. తుమ్మకోట-మాచర్ల బజారులో వెళ్లాలంటే పాదాచారులు, ద్విచక్రవాహనదారులు ముక్కు మూసుకోవాల్సిందే. మంచికల్లులో అంతే.. రెంటచింతలలో ఆంజనేయస్వామి కాలనీ, రైలుపేట, అంకమ్మ, నగర్, ఆరోగ్యపురం కాలనీల్లో నడవాలంటే సాహసం చేయాల్సిందే. మల్లవరంలో బజార్ల వెంట దిబ్బలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది.

- న్యూస్‌టుడే, రెంటచింతల

కీలక పోస్టులన్నీ ఖాళీనే..!

దుర్గిలో ఇన్‌ఛార్జుల పాలన

దుర్గి, న్యూస్‌టుడే:

మండలంలోని రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ, విద్యుత్తుశాఖ, వెలుగు కార్యాలయాల్లో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. కొన్నాళ్లుగా ఇన్‌ఛార్జులతో నెట్టుకొస్తున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల అభివృద్ధి కుంటుపడుతోంది. ఎన్నికల ముందు దుర్గి తహసీల్దార్ రమేష్‌కుమార్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ్నుంచి రజనీ కుమారి తహసీల్దార్ ఎన్నికల విధులు నిర్వహించి, అనంతరం బదిలీపై సొంత జిల్లాకు వెళ్లారు. సాధారణ బదిలీల్లో భాగంగా వేణుగోపాల్‌రావును నియమించగా.. ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ఉప తహసీల్దార్ ఫణీంద్రకుమార్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చి ఉన్నతాధికారులు చేతులు దులుపుకొన్నారు. భూ సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారం, పరిపాలన దృష్ట్యా ఆయన వారానికి మూడ్రోజులపాటు కలెక్టరు కార్యాలయానికి, గురజాల ఆర్డీవో కార్యాలయానికి, హైకోర్టుకు వెళుతున్నారు.

★ ఎన్నికల సమయంలో దుర్గి ఎంపీడీవో సమతావాణిని ఇతర జిల్లాకు పంపించేశారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ గుప్తాతోనే ఎన్నికల విధులు చేయించారు. ఆ తర్వాత తిరిగి వచ్చిన సమతావాణి ఒక్క రోజులోనే మరో మండలానికి వెళ్లడంతో ఈవోపీఆర్డీకి ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చారు. ఇటీవల సాధారణ బదిలీల్లో గుప్తా కూడా బదిలీపై దాచేపల్లి వెళ్లారు. దీంతో ఏవో శివప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు.

★ మండలానికి ఇద్దరు విద్యాశాఖాధికారులను నియమించారు. విద్యాశాఖాధికారి-1 పోస్టుకు మాచర్లలో పనిచేస్తున్న వేముల నాగయ్యకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆయన గత జూన్‌లో రిటైర్డు అయ్యారు. దీంతో శ్యావల్యాపురం మండలంలో పని చేస్తున్న సాంబశివరావుకు దుర్గితోపాటు నూజెండ్ల మండలానికి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఫలితంగా విద్యాశాఖలో సమస్యలు తిష్టవేశాయి.

★ విద్యుత్తు శాఖలో సబ్ ఇంజినీరు, ఏఈ పోస్టులు నెల నుంచి ఖాళీగా ఉన్నాయి. మండలంలో విద్యుత్తు సమస్యలకు జవాబు చెప్పేవారే లేరు. వెలుగు కార్యాలయంలో ఏపీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో.. కారంపూడి ఏపీఎం శివకుమార్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. కీలక పోస్టులకు శాశ్వత ప్రాతిపదికన అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.


దుర్గి తహసీల్దార్ కార్యాలయం

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

నిత్యావసర సరకుల పంపిణీ


లబ్ధిదారులతో అసిస్ట్ ప్రతినిధులు

యడ్లపాడు, న్యూస్‌టుడే : చిలకలూరిపేటలోని స్వచ్ఛంద సంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో వేద్ ఇండియా, మై టు వండ్ సంస్థల సంయుక్త సహకారంతో మండలంలోని తిమ్మాపురంలోని రెండు ఎస్టీకాలనీల్లో బియ్యం, కందిపప్పు, వంటనూనె, గోధుమ పిండి, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. అసిస్ట్ డైరెక్టర్ కృష్ణ హరీష్, సర్పంచ్ పి.ప్రభావతి, అసిస్ట్ కో-ఆర్డినేటర్ డేవిడ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం

చిలకలూరిపేట గ్రామీణ : చిలకలూరిపేట రూరల్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో నేలకొరిగిన పోలీసు అమరవీరుల చిత్రపటాలకు సీఐ సుబ్బానాయుడు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్సై అనిల్‌కుమార్, పుల్లారావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

వినుకొండ గ్రామీణ : పట్టణ సీఐ శోభన్ బాబు ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమర వీరుల దినోత్సవం నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సైలు సర్ణలత, సమీర్ బాషా పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని పెద్దచెరువు 9వ లైను వినాయకుడి సమీపంలో చెత్త డబ్బాలు నిండి చెత్త కింద పడి దుర్గంధం వెదజల్లుతోంది. - మహాలక్ష్మి

✔ ఆ ప్రాంతానికి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. - జస్వంతరావు, పురపాలక సంఘ కమిషనర్

? పట్టణంలోని ఆవులసత్రం ఎదురు బజారులో మ్యాన్‌హోల్ మూత పగిలింది. స్థానికులు పెద్ద రాయి ఏర్పాటు చేయగా భారీ వాహనాల తాకిడికి అది పగిలి ప్రమాదకరంగా మారింది. - శ్రీనివాసరావు

✔ కొత్త మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - జస్వంతరావు, పురపాలక సంఘ కమిషనర్

- నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించిన ప్రజల సమస్యలపై మున్సిపల్ అధికారులు స్పందించారు. ఎన్జీవోకాలనీలోని వైష్ణవి టవర్స్ సమీపంలో మురుగు కాల్వ సమస్యను సోమవారం పరిష్కరించారు. కాల్వలో వ్యర్థాలు తొలగించి మురుగు పారేందుకు చర్యలు తీసుకున్నారు.

ఊరికి దూరం.. మేం వెళ్లం

☛ నత్తనడకన సాగుతున్న ఇళ్ల నిర్మాణం ☛ జగనన్న లేఅవుట్లపై లబ్ధిదారుల అనాసక్తి

వినుకొండ రూరల్, వినుకొండ, యడ్లపాడు, చిలకలూరిపేట గ్రామీణ న్యూస్‌టుడే

మేం కట్టించేది ఇళ్లు కాదు ఊర్లు అన్నారు. ఊళ్లేమో దేవుడెరుగు ముందు చేసిన అప్పులు పెరుగుతున్నాయి.. కానీ ఇళ్లు పూర్తయింది లేదు. ఒకవైపు ఉంటున్న ఇళ్లకు అద్దె కట్టలేక.. కొత్త ఇంటికి తెచ్చిన అప్పునకు వడ్డీ చెల్లించలేక పోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని వైకాపా ప్రభుత్వం అందించిన స్థలాలు నేటికీ ఖాళీగానే కనిపిస్తున్నాయి. నాలుగేళ్ల కిందట గృహ నిర్మాణ పథకం ప్రారంభమైంది. అప్పట్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి కట్టుకునేందుకు ఆర్థిక సాయం చేస్తారని ప్రజలు పరుగులు పెట్టారు. చివరికి అధికార పార్టీ ఎంపిక చేసిన వ్యక్తులనే లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. మండలాల్లో లేఅవుట్లు ఏర్పాటు చేసి పట్టాలు అందజేశారు. తర్వాత తమకు ఇచ్చిన స్థలాలు ఎక్కడ ఉన్నాయో లబ్ధిదారులు వెళ్లి చూసి నిరాశ చెందారు. కొన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఏళ్లుగా ఇళ్ల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. గృహ ప్రవేశాలకు పెట్టిన ముహూర్తాలు దాటిపోయాయి. వసతుల కల్పన పూర్తిస్థాయిలో జరగలేదు. గత ఏడాది సెప్టెంబరులో వినాయక చవితికి కొందరు లబ్ధిదారులకు గృహ ప్రవేశం కల్పిస్తామని చెప్పినా ఆచరణ కాలేదు.


నాగులవరంలో ఊరికి దూరంగా లేఅవుట్

అనుకూలంగా లేని లేఔట్లు..

నిర్మాణాలకు అవసరమైన లేఔట్లకు కొన్ని గ్రామాల్లో భూములు కొన్నారు. అవి గ్రామానికి దూరంగా ఉండటం, శ్మశానాలకు దగ్గరగా ఉండటం, వ్యవసాయ భూములు కావడంతో ఇళ్లకు అనుకూలంగా లేవని లబ్ధిదారుల వాదన. వినుకొండ మండలంలో 380 ఇళ్లు మంజూరైతే 77 మాత్రమే నిర్మాణంలో ఉన్నాయి. ☛ గోనెకొండలో 79 మంజూరు కాగా శ్మశానానికి దగ్గరగా ఉండటం, గుండ్లకమ్మ నది పక్కనే ఉన్నందున ఆ గ్రామస్థులు మరోచోట కావాలని ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. ఉమ్మడివరంలో 41 ఇళ్లు మంజూరైతే శ్మశానానికి అనుకుని ఉన్న స్థలం కావడంతో వద్దని ఎవరూ ముందుకు రాలేదు. నాగులవరంలో 86 ఇళ్లు మంజూరు కాగా ఆ స్థలం ఊరికి దూరంగా ఉన్నందున ఎవరూ సాహసించలేదు. పెరుమాళ్లపల్లిలో రెండు లేఅవుట్లలో ఒక దానిలో 43 ఇళ్లకు ఒక్క ఇల్లు కూడా కట్టలేదు.


తిమ్మాపురంలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

☛ నూజెండ్ల మండలంలో 10 గ్రామాల్లో 19 లేఔట్లు వేసి 1140 ఇళ్లు మంజూరు చేయగా అందులో 9 లేఔట్లలో ఒక్క ఇల్లూ నిర్మించలేదు. మిగిలిన పది చోట్ల నామమాత్రంగానే నిర్మాణాలు చేపట్టారు. గృహాలు మంజూరైన చంద్రవరం, ములకలూరు, పువ్వాడలో 1, 2, 4, తెల్లాకుపల్లిలో 1, 4, మారెళ్లవారిపాలెం, అప్పాపురంలో 1 లేఔట్లలో ఒక్క ఇల్లూ నిర్మించలేదు.

☛ చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడు మండలంలో చెంఘీజ్‌ఖాన్‌పేట, జగ్గాపురం, జాలాది, కారుచోల, లింగారావుపాలెం, తిమ్మాపురంలో 183 ఇళ్లు పూర్తి కాగా 507 వివిధ దశల్లో ఉన్నాయి.

☛ పట్టణ గృహ నిర్మాణాల్లో 146 పూర్తి కాగా 1467 వివిధ దశల్లో ఉన్నాయి. చిలకలూరిపేట, నాదెండ్ల మండలాల్లో అన్ని గ్రామాల్లో లేఔట్లు ఉన్నా ప్రభుత్వం నిధుల ఇవ్వక ఇంత వరకు ఒక్కచోట కూడా గృహాలు ప్రారంభం కాలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి..

లేఔట్లలో ఇంతవరకు నిర్మాణాలు చేపట్టని వారికి కట్టాలని చెబుతున్నాం. మిగిలిన గ్రామాల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. పనులు చేసిన వారికి బిల్లుల చెల్లింపులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో శ్మశానం పక్కనే ఉందని, ఊరికి దూరంగా ఉందని నిర్మాణానికి ముందుకు రావడం లేదు. స్థలాలు మార్పు చేయడంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. సమస్యలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తా.
- శ్రీనివాసరావు డీఈ, గృహ నిర్మాణశాఖ, వినుకొండ

సృజన చూపిన విద్యార్థులు

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు


విజేతలైన విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో నరసరావుపేట మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు సోమవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భాగంగా ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పాఠశాల బాలికలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో రాణించి మీనాకుమారి (పదో తరగతి) ప్రథమ, ఎస్కే ఆర్షియా (పదో తరగతి) ద్వితీయ, షేక్ మీరాతబుసుం (9వ తరగతి) తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయిని నిర్మలాబాయి బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు డీవీ రమణ, సుబ్బారావు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు


విజేతలతో ప్రిన్సిపల్ శేషగిరిరావు, డీన్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ అవినాష్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో చిలకలూరిపేట పట్టణం నారాయణ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ఎం.వెంకట అజయ్‌కుమార్, పి.జెస్సిక, కె.మనస్వినికి ప్రిన్సిపల్ కె.శేషగిరిరావు, డీన్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ అవినాష్ బహుమతులు అందజేశారు.

కలకలం రేపిన కాగితాల దహనం


ఇక్కుర్రు కొండ సమీపంలో దహనం చేస్తున్న కాగితాలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మండలంలోని ఇక్కుర్రు కొండ సమీపంలో కాగితాల దహన ఘటన కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇక్కుర్రు నుంచి రొంపిచర్ల మండలానికి వెళ్లే రహదారిలో ఉన్న కొండ వద్ద నలుగురు వ్యక్తులు కాగితాలు కాలుస్తూ స్థానికులకు కనిపించారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో రిజిస్ట్రార్ కార్యాలయ దస్తావేజుల ఘటనలా ఇక్కడ కూడా ప్రభుత్వ ఆస్తుల కాగితాలు దహనం చేస్తున్నారన్న అనుమానాలు వారిలో తలెత్తాయి. దీంతో గ్రామ రెవెన్యూ సిబ్బంది సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకొని విచారించగా ఓ ప్రైవేటు బ్యాంకు కాగితాలు దహనం చేస్తున్నట్లు గుర్తించారు. ఏమైనా ఉంటే మీ కార్యాలయాల పరిధిలోనే దహనం చేయాలని, ఇలా బహిరంగ ప్రాంతాల్లో చేయకూడదని, మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బంది వారిని హెచ్చరించారు.

రహదారి జలమయం.. రాకపోకలకు గండం

క్లిక్‌టుడే



పట్టణంలోని మార్కాపురం రోడ్డు నుంచి 15వ వార్డు పాటిమీదకు బజారుకు వెళ్లే మార్గంలో లారీ యూనియన్ కార్యాలయం వెనుక రహదారి చెరువును తలపిస్తోంది. తారురోడ్డు నుంచి సిమెంట్ రోడ్డుకు మధ్యలో అప్రోచ్ సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించనందున వర్షం నీరు వెళ్లలేక అక్కడే నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరి వార్డు పరిధిలో ఈ మార్గం ఉన్నందున అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - వినుకొండ, న్యూస్‌టుడే

ఈఈ బాధ్యతల స్వీకారం

వినుకొండ, న్యూస్‌టుడే : నీటి పారుదల శాఖ నాణ్యత, నియంత్రణ విభాగం వినుకొండ డివిజన్ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక ఇంజనీరు (ఈఈ)గా ఆర్.విజయలక్ష్మి నియమితులయ్యారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇంజనీరింగ్ అధికారులు మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు.

ఈపూరు సీహెచ్‌సీ వైద్యాధికారిణిగా హేమలత

ఈపూరు, న్యూస్‌టుడే : ఈపూరు సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారిణిగా కె.హేమలత నియమితులయ్యారు. ఏపీ సెకండరీ హెల్త్ గుంటూరు జిల్లా సమన్వయకర్త మజీదా బేగం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ వైద్యాధికారి టి.కమలాకరరావు ఆత్మహత్యాయత్నం చేసుకోగా ఆసుపత్రిలో దంత వైద్యురాలిగా పనిచేస్తున్న కె.హేమలతను తాత్కాలికంగా వైద్యాధికారిణిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎం 23న

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు సోమవారం తెలిపారు. డిపో పరిధిలో గల నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండల ప్రజలు బస్సు సర్వీసులపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. 9959225427కు కాల్ చేయాలని కోరారు.

పట్టణ ప్రణాళికా విభాగం అధికారిగా సాంబయ్య

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : నరసరావుపేట మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారిగా సాంబయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన బదిలీల్లో భాగంగా ఆయన పొన్నూరు నుంచి నరసరావుపేటకు బదిలీ అయ్యారు. నెల తర్వాత ఆయన విధుల్లో చేరారు. ఇక్కడ టీపీవోగా పని చేసిన నర్సింహరావు గుండెపోటుతో మృతి చెందిన విషయం విధితమే.

ఎరువులు పంపిణీ చేయాలని వినతి

రొంపిచర్ల : రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఎరువులు సకాలంలో పంపిణీ చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, మధు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

వినుకొండ, న్యూస్‌టుడే : శాసనమండలి పట్టభద్రుల స్థానం ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్ కుమార్ కోరారు. స్థానిక సంఘ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు అధ్యక్షతన ఆదివారం రాత్రి నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.హనుమంతరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా బాధ్యులు నవీన్, పొరుగు సేవల ఉద్యోగుల సంఘ నేత మాచర్ల బుజ్జి పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో డ్రోన్లకు ప్రాధాన్యం


డ్రోన్లు ప్రదర్శిస్తున్న అకడమీ ప్రతినిధి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : సాంకేతిక రంగంలో డ్రోన్ పరిజ్ఞానం అన్ని రంగాలకు విస్తరిస్తున్నట్లు ఇండియన్ డ్రోన్ అకాడమీ ఎండీ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డ్రోన్ పరిజ్ఞానం, వినియోగం అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఉదయం సంస్థ ప్రతినిధులు ఆర్.దేవ్, సందీప్ శ్రీనివాస్, రామకృష్ణ డ్రోన్ పరిజ్ఞానం, ప్రాధాన్యం, వినియోగం ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం డ్రోన్లను ప్రదర్శించారు. కళాశాల ఛైర్మన్ మీరావలి, కార్యదర్శి కరీమ్ మొహిద్దీన్, డైరెక్టర్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై అవగాహన

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఫోరం వ్యవస్థాపకుడు షేక్ జాఫర్ మాట్లాడుతూ కృష్ణా- గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి నెలలో జరుగుతున్న నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు చుండి శివప్రసాద్, షేక్ హసినా, అంజయ్య, ఆల్‌బీన్, లాల్బి, ఆదినారాయణ, సక్రునాయక్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థి ప్రతిభ

కనమర్లపూడి (శావల్యాపురం) : కనమర్లపూడి సమీపంలోని సంసిధ్ పాఠశాలలో యూకేజీ విద్యార్థి భవనాసి వంశీ వేదాన్ష్ ఇన్లైన్ రింగ్స్‌లో అండర్- 7 విభాగంలో జిల్లా స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగ సురేష్ తెలిపారు. నవంబరు 6న జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలతో పాటు, 62వ నేషనల్ ఎంపిక పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పూర్వ విద్యార్థుల సంఘ నాయకుడు కందిమళ్ల నారాయణమూర్తి కోరారు. మురికిపూడి కందిమళ్ల శారదాంబ జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి సోమేపల్లి ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు ఎన్ఆర్ఐ సోమేపల్లి అనిల్ కుమార్ సహకారంతో సోమవారం పాఠశాలకు పూల మొక్కలతో పాటు కుండీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని దేవరకొండ ధనలక్ష్మి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు భీమినేని స్వాములు, సుంకర కొండలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ నవీకరణ శిబిరాలు

వినుకొండ, న్యూస్‌టుడే : ఆధార్ నవీకరణకు 22 నుంచి 25 వరకు పురపాలక సంఘంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలి రోజు మంగళవారం ఓబయ్యకాలనీ 9వ సచివాలయం, బుధవారం హనుమాన్‌నగర్ 12వ సచివాలయం, గురువారం ఎన్నెస్పీ కాలనీ 1వ సచివాలయం, శుక్రవారం శాలివాహనగర్ 7వ సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈపూరు : ఆధార్ నవీకరణ, కొత్తగా ఆధార్ నమోదుకు మండలంలో 22 నుంచి 25 వరకు మొబైల్ ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. 22, 23 తేదీల్లో ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 24న కొచ్చెర్ల, 25న ముప్పాళ్లలో ఏర్పాటు చేయనున్నారు.

ఎమ్మార్పీకి విక్రయించాల్సిందే

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే : ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట ఏడీఏ పి.మస్తానమ్మ హెచ్చరించారు. పట్టణంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఆమె స్థానిక ఏవో నరేంద్రబాబుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిస్టర్లను, బిల్లుపుస్తకాలు, ఇన్వాయిస్ పేపర్లను, ఎరువుల నిల్వలు పరిశీలించారు.

ఉపాధి హామీ కూలీ ఇవ్వలేదని ఫిర్యాదు

మతుకుమల్లి (శావల్యాపురం) : ఉపాధి హామీ పథకం కూలీలతో మతుకుమల్లి రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన నీటి శుద్ధి విభాగాల్లో క్షేత్ర సహాయకుడు పని చేయించి వేతనాలు ఇవ్వలేదని 7న కూలీలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలో మండల అధికారులు ఏపీవోతో తూతూమంత్రంగా గ్రామంలో విచారణ చేపట్టారు. దానిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. సోమవారం గ్రామానికి చెందిన ఉప్పలపాటి అన్నపూర్ణ మరి కొందరు కూలీలు కలెక్టర్‌కు మళ్లీ ఫిర్యాదు చేశారు. కేవలం కూలి డబ్బులు మాత్రమే కాకుండా నీటిశుద్ధి విభాగాల్లో పని చేయించినట్లుగా రూ.లక్షల్లో నిధులు డ్రా చేశారని వారు ఆరోపించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

చిరుమామిళ్ల (నాదెండ్ల) : పట్టుదలతో వ్యవహరిస్తే విద్యావంతులందరికీ సమజంలో ఉన్నత స్థానాలు లభిస్తాయని హైదరాబాద్ గోల్కొండ హోటల్స్ గ్రూపు సంస్థల ఛైర్మన్ నడికట్టు రామిరెడ్డి అన్నారు. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల శ్రీనడికట్టు రామిరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. జన్మదినోత్సవం సందర్భంగా రామిరెడ్డితో గ్రామస్థులు, విద్యార్థులు కేకు కోయించి.. సన్మానించారు.

రూ.లక్షల వ్యయం.. అయినా నిర్లక్ష్యం

ఐదేళ్లుగా నిరుపయోగంగా యంత్రాలు
బాగు చేయిస్తే ప్రజలకు ఉపయోగం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: నరసరావుపేట పురపాలక సంఘంలో మురుగు కాలువల మరమ్మతులకు, రోడ్ల శుభ్రం చేసేందుకు, చిన్న చిన్న వీధుల్లో చెత్త తరలించేందుకు రూ.కోట్లు వెచ్చించి యంత్రాలు కొనగా అవి చెడిపోయి ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. గత వైకాపా పాలనలో ఆరుగురు కమిషనర్లు మారారు.. కానీ ఏ ఒక్కరూ వీటి గురించి ఆలోచన చేయలేదు. దీంతో అవి తుప్పు పట్టి నిరుపయోగంగా ఉన్నాయి.


తుప్పు పడుతున్న క్లాప్ ఆటోలు


మూలనపడ్డ మురుగు కాలువల్లో పూడిక తీసేందుకు తెచ్చిన మినీ పొక్లెయిన్

● పట్టణంలో వీధులను శుభ్రం చేసేందుకు రూ.10 లక్షల చొప్పున రెండు వాహనాలు కొని మూడు నెలలు వినియోగించారు. అనంతరం అవి మరమ్మతులకు గురయ్యాయి. తర్వాత అలాగే వదిలేశారు. చిన్న చిన్న వీధుల్లో మురుగు కాలువల్లో వ్యర్థాలు తొలగించేందుకు రూ.లక్షలు వెచ్చించి మినీ పొక్లెయిన్ కొని కొంత కాలం వినియోగించి వదిలేశారు. దోమలమందు పిచికారికి ఆటో కొని ఏడాదికే చెడిపోయిందని పక్కన పెట్టారు. కార్యాలయంలో జీపు సైతం నిరుపయోగంగా ఉంది. ఇలా రూ.లక్షల యంత్రాలు, వాహనాలు మూలన పడి ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడం పలు విమర్శలు తావిస్తోంది. చివరకు కార్యాలయంలో సిబ్బంది తాగేందుకు దాతలు ఇచ్చిన మంచినీటి ట్యాంకును సైతం నిరుపయోగంగా వదిలేశారు.

తుప్పు పడుతున్న స్వచ్ఛాంధ్ర వాహనాలు..

పురపాలక సంఘంలో స్వచ్ఛాంధ్ర మిషన్ ఆధ్వర్యంలో గత వైకాపా ప్రభుత్వం 16 క్లాప్ ఆటోలను తెప్పించింది. వాటిని పట్టుమని ఆరు నెలలు మాత్రమే వినియోగించారు. వాహనాల డ్రైవర్లకు జీతాలు చెల్లించక అవి మూడేళ్లుగా మూలన పడి ఉన్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు వాహనాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పుర ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

శావల్యాపురం, న్యూస్‌టుడే : గుంటూరు ఎన్జీవో హోమ్ క్రీడా మైదానంలో 20న జిల్లా సీనియర్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జట్టు ఎంపిక చేపట్టారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థినులు ఎ.సమీర, కె.కావ్య, ఎం.లూథియ, వి.దివ్య, బి.దేవమణి, ఒ.స్రవంతి, ఆర్.రత్నకీర్తన, పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థినులు ముక్కపాటి లిఖిత (బీటెక్,), యు.బసవరాణి (ట్రిపుల్ ఐటీ) పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామోపాధ్యాయుడు రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. నవంబరు 8 నుంచి 10 వరకు నంద్యాలలో నిర్వహించే 9వ రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులను పీఎంసీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుని బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

వినుకొండ రూరల్ : స్కూల్‌గేమ్స్ పోటీల్లో ప్రతిభ చూపి తమ పాఠశాల విద్యార్థులు 9 మంది జిల్లా పోటీలకు అర్హత సాధించారని గుడ్ షెపర్డ్ పాఠశాల డైరెక్టర్ ఇన్నారెడ్డి తెలిపారు. అండర్- 18 కేటగిరి జిల్లా ఖోఖో జట్టుకు విష్ణువర్ధన్, నాగరాజు, మణికంఠ ఎంపికైనట్లు పేర్కొన్నారు. అండర్- 14 సాఫ్ట్‌బాల్ విభాగంలో మోహన్‌గోపి, రాకేశ్, రామకోటేశ్వరరావు, షటిల్ బ్యాడ్మింటన్‌లో కమల్‌కుమార్, అండర్- 14 ఖోఖో జట్టుకు ఆంజనేయనాయక్, నాగవేణి ఎంపికైనట్లు చెప్పారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీసునీత, వ్యాయామ ఉపాధ్యాయులు అజీమ్, కొండలు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట అర్బన్ : నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూ (కే) సెంట్రల్ జోన్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి విజేతలుగా నిలిచారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన పోటీల్లో ధనుష్, నాగేంద్ర, బాలసతీష్, ఆదిత్యచరణ్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విజేతలను కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ చక్రవర్తి, కార్యదర్శి రమేష్ అభినందించారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

నాదెండ్ల, న్యూస్‌టుడే : రేషన్ డీలర్లు లబ్ధిదారులకు నిత్యావసర రాయితీ సరకులకు బదులు నగదు చెల్లిస్తే వారిని సస్పెండ్ చేస్తామని, ప్రభుత్వం అనుమతించిన రీచ్‌ల నుంచి వాహనాల పరిమితి మేరకు ఇసుకను ప్రజలు ఉచితంగా తెచ్చుకోవచ్చని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్ల మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. మద్యం దుకాణాల ఏర్పాటులో వ్యాపారులు నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం గ్రామంలో సీసీరోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

చిలకలూరిపేట పట్టణం : పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా చెక్కులను సోమవారం అందజేశారు.